సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



మోతుగూడెం: పరవళ్లు తొక్కుతున్న పొల్లూరు జలపాతం



మోతుగూడెం: డొంకరాయి జలాశయం నుంచి విడుదలవుతున్న వరదనీరు

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు పెరుగుతుండటంతో విలీన మండలాల ప్రజల్లో వరద గుబులు నెలకొంది. సోమవారం మరింత పెరిగే అవకాశం ఉందని కేంద్ర జలవనరులశాఖ అధికారుల హెచ్చరికలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. సుమారు 40 రోజులక్రితం సంభవించిన వరదల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో మళ్లీ వరద హెచ్చరికలు హడలెత్తిస్తున్నాయి.

వరద గుబులు



చింతూరు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి నది

- పెరుగుతున్న గోదావరి, శబరి నీటిమట్టాలు
- ఎగదన్నిన వాగులు.. ముంపులో లోతట్టు ప్రాంతాలు
- విలీన మండలాల్లో 20 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

చింతూరు: గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు ఆదివారం ఉదయం ఒక్కసారిగా పెరగడంతో విలీన మండలాల ప్రజలను వరద భయం వెంటాడుతోంది. అయితే ఆదివారం సాయంత్రానికి అటు గోదావరి, ఇటు శబరినదుల నీటిమట్టాలు స్వల్పంగా తగ్గినా తెలంగాణ, ఒడిశాల్లో భారీ వర్షాలు కురుస్తాయనే సమాచారంతో మళ్లీ పెరిగే అవకాశం ఉందని కేంద్ర జలవనరులశాఖ సూచనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

- భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం మధ్యాహ్నానికి 31.9 అడుగులకు చేరుకుని రాత్రి 9 గంటలకు 29.9 అడుగులకు తగ్గింది.
- గోదావరి వరద కూనవరం మండలం కొండ్రాజుపేట కాజ్‌వే పైకి చేరడంతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- చింతూరు మండలంలో కుయిగూరు వాగు, సోకిలేరు వాగులు పొంగడంతో ఆంధ్రా, ఒడిశా నడుమ, చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ, చింతూరు మండలంలో 15 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.
- ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వస్తున్న వరదనీటితో ఆదివారం స్థానిక శబరినది ఒక్కసారిగా పెరిగింది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని వాగులు పొంగి వరదనీరు రహదారులపైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రానికి వాగులు నెమ్మదిగా తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.
- సోకిలేరు, జల్లివారిగూడెం, చీకటి వాగులు పొంగడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య ఆదివారం ఉదయం నుంచి రాకపోకలు స్తంభించాయి.
- చూటూరు, ముకునూరు, నర్సింగపేట, రామన్నపాలెం, బొడ్రాయిగూడెం, చినసీతనపల్లి, కొండపల్లి, పెదశీతనపల్లి, ఏజీకొడేరు, ఉలుమూరు, మల్లెతోట గ్రామాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి.
- **కుయిగూరు వాగు పొంగి వరదనీరు జాతీయ రహదారి–326 పైకి చేరడంతో ఆంధ్రా నుంచి ఒడిశాకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పాటు చింతూరు మండలంలోని కుయిగూరు, కల్లేరు, సూరన్నగొంది, మదుగూరు గ్రామాలకు సైతం రాకపోకలు స్తంభించాయి. కుయిగూరు వరద ఉధృతి కారణంగా చింతూరు మండలం నిమ్మలగూడెం రైతులకు చెందిన వరిపొలాలు నీటమునిగాయి.**
- చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో అపూర్వభరత్, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా ఆదివారం చింతూరు, కూనవరం మండలాల్లో వరదముంపు ప్రాంతాలను పరిశీలించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి.. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. రహదారులు ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజలు వాగులు దాటకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది కాపలాగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను తరలించేందుకు పడవలు ఏర్పాటు చేయాలని పీవో ఆదేశించారు.

పొంగిన అలుగు వాగు

ఎటపాక: కన్నాపురం అలుగు వాగు ప్రాజెక్టు నుంచి వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. మురుమూరు, నందిగామ, తోటపల్లి, నెల్లిపాక, రాయనపేట వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గౌరిదేవిపేట, నల్లకుంట, కృష్ణవరం, వీరాయిగూడెం తదితర గ్రామాల రహదారిపైకి వరదనీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తోటపల్లి నుంచి గొల్లగూడెం వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. గౌరిదేవిపేట వద్ద పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. తాలిపేరు, దుమ్ముగూడెం ప్రాజెక్టుల నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో భద్రాచలం వద్ద గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది.



వరద నీటిని దాటించేందుకు మహిళలను తన వాహనంలో ఎక్కిస్తున్న పీవో అపూర్వభరత్

పీవో మానవత్వం

చింతూరు మండలం ఉలుమూరులో పర్యటిస్తున్న సమయంలో ఓ కుటుంబం వరదనీటిని దాటేందుకు ప్రయత్నిస్తుండటాన్ని పీవో అపూర్వభరత్ గమనించారు. వెంటనే వారిని తన వాహనంలో ఎక్కించి రోడ్డు మార్గంలో అవతలి వైపునకు తీసుకువెళ్లారు. అక్కడ ఉన్న మరి కొంతమంది మహిళలను తిరిగి ఇవతలి ఒడ్డుకు చేర్చి మానవత్వం చాటుకున్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

కూనవరం: శబరి, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా సూచించారు. వరద సమయంలో మండల పరిధిలో రోడ్డు బ్లాక్ పాయింట్లను వారు పరిశీలించారు. కొండ్రాజుపేట, టేకులబోరు మధ్య కాజ్‌వేపైకి చేరిన వరదనీటిని పరిశీలించారు. పంద్రాజుపల్లి వద్ద నాలుగు వైపులా కోతకు గురైన ఆర్అండ్‌బీ రోడ్డులో కల్వర్టుకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. చూచిరేవులగూడెం పంచాయతీ భీమవరం వద్ద రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువు నిండి ఆర్అండ్‌బీ రోడ్డు పైకి వరదనీరు అడ్డంగా ప్రవహిస్తోంది. దీనిని గమనించిన పీవో ఎవరూ దిగకుండా సిబ్బందిని ఉంచాలని ఆదేశించారు. అనంతరం శబరి బ్రిడ్జి వద్ద శబరి, గోదావరి నదుల ఉధృతిని పీవో పరిశీలించారు. వర్షాలు, వరదల పరిస్థితిపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయడమే కాకుండా బోటు యజమానులను అందుబాటులో ఉంచుకోవాలని తహసీల్దార్ నాగబాబును ఆదేశించారు.

రాజవొమ్మంగి: మండలంలో పొంగి ప్రవహిస్తున్న వట్టిగెడ్డ తదితర వాగులు ప్రాంతాల్లో ఆదివారం రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం పర్యటించారు. ప్రజలు వాగులు దాటకుండా చూడాలని ఈ సందర్భంగా ఆయన డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావును ఆదేశించారు. అనంతరం జడ్డంగి పీహెచ్‌సీని సందర్శించారు. వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు ఐటీడీఏ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు పీవో సింహాచలం తెలిపారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

సాక్షి,పాడేరు: అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ అప్రమత్తం చేశారు.

అరకులోయలో అత్యధికం

జిల్లా కేంద్రమైన పాడేరులో ఆదివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. ప్రధాన వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా అరకులోయలో 20 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కూనవరంలో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనంతగిరిలో 15.2, హుకుంపేటలో 10.8, పాడేరులో 8.2, డుంబ్రిగుడలో 6, జి.మాడుగులలో 5, రంపచోడవరంలో 4.4, అడ్డతీగలలో 4.2, మారేడుమిల్లిలో 3.4, గంగవరంలో 2.2, జీకేవీధిలో 2.2, వై.రామవరంలో 1.8, ఎటపాకలో 1.2, దేవీపట్నంలో 1.2, ముంచంగిపుట్టులో 1, పెదబయలులో 1, చింతపల్లిలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి.

నేడు విద్యాసంస్థలకు సెలవు

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 2వతేదీ సోమవారం జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉత్వర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు సెలవు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలు కూడా సెలవు ఇవ్వాలని, ఎటువంటి తరగతులు నిర్వహించవద్దని ఆయన సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సెలవును గమనించి తమ పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు పంపవద్దని సూచించారు. అలాగే గెడ్డలు, వాగులను ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులు దాటవద్దని కలెక్టర్ ప్రజలను అప్రమత్తం చేశారు.



గౌరిదేవిపేట వద్ద చెరువులను తలపిస్తున్న పొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న నందిగామ వాగు



ఎటపాక మండలంలో వరద ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయిన గొల్లగూడెం రహదారి



ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారి-326పై నిలిచిఉన్న కుయిగూరు వాగు వరదనీరు



చింతూరు మండలం నిమ్మలగూడెం వద్ద నీట మునిగిన వరి నాట్లు



గింజర్తి వద్ద వట్టిగెడ్డ వాగు ఉధృతిని పరిశీలిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం

మళ్లీ అస్వస్థతతో ఆందోళన

- జామిగుడ ఆశ్రమ పాఠశాలలో కుదుటపడని విద్యార్థినుల ఆరోగ్యం
- అనారోగ్యానికి గురైన 15 మంది ఆస్పత్రికి తరలింపు
- తల్లిదండ్రుల్లో ఆందోళన

సాక్షి, పాడేరు: జిల్లాలోని డుంబ్రిగుడ మండలం జామిగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మరో 15 మంది గిరిజన బాలికలు ఆదివారం అస్వస్థతకు గురవడం ఆందోళనకు దారితీసింది. విద్యార్థినులు కె.మేరి, మంగమ్మ, సరళ, పార్వతి, దివ్యతేజశ్రీ, షర్మిల, శాంతి, కీర్తి, శ్రీలత, ఈశ్వరి, కె.శిరీష, ఎస్తేరురాణి, సంఘవి, సరోజ, శైలు తదితరులు వాంతులు, కడుపునొప్పితో పాటు జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. కిల్లోగుడ వైద్య బృందం ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యానికి హుటాహుటిన అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఆశ్రమ పాఠశాలలో అనారోగ్య పరిస్థితులు తగ్గుముఖం పట్టాయని తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మళ్లీ విద్యార్థినులు అస్వస్థతకు గురవడం మిగిలిన పిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగించింది.

డుంబ్రిగుడ: జామగుడ ఆశ్రమ పాఠశాలలో మరో 15 మంది విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులు, తలనొప్పి లక్షణలతో ఆదివారం అస్వస్థతకు గురికావడంతో మిగతా పిల్లల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వసతి గృహంలో ఉన్న పిల్లలను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్తున్నారు. అజీర్తిని గిరిజనులు పోదు అని పిలుస్తుంటారు. దీని నివారణకుగాను బెరడు, వనమూలికలతో తయారు చేసిన మందును శరీర పైభాగంలో గొంతు దగ్గర నుంచి కాళ్ల వరకు రాస్తుంటారు. ఇందు నిమిత్తం తీసుకువెళ్తున్నట్టు వారు తెలిపారు. ఇలా ఉండగా ప్రస్తుతం వసతి గృహంలో మెనూ ప్రకారం ఆహారం, తాగేందుకు వేడినీరు అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

అందుబాటులోకి ఆర్వో ప్లాంట్

డుంబ్రిగుడ: మండలంలోని జాముగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీరాయి. సురక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చింది. శనివారం ఈ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. దీంతో ప్లాంట్ ఆదివారం అందుబాటులోకి వచ్చింది. ఈ ప్లాంట్ నీటిని తాగునీటి అవసరాలు, వంటకు వినియోగించాలని యాజమాన్యాన్ని పీవో ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ కనబరచడమే కాకుండా ఆశ్రమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయురాలు సుజాతను ఆదేశించారు. ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.



విద్యార్థినులను అంబులెన్స్‌లో అరకు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థినులను ఇళ్లకు తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు



ఆశ్రమ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యమా?

ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి ధ్వజం

అరకులోయ రూరల్: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఆశ్రమ నిర్వాహకులకు నిర్లక్ష్యం తగదని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి ధ్వజమెత్తారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆదివారం ఆమె సందర్శించారు. చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ ఘటనలో డీడీ, ఏటీడబ్ల్యూవోలను బాధ్యులు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. విద్యార్థినుల బాగోగులను పర్యవేక్షించాల్సిన అధికారులు తప్పులు చేసే హెచ్‌ఎం, వార్డెన్లకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. గతంలో ఇదే ఆశ్రమంలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందితే ఇదే హెచ్‌ఎంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రను వీడలేదన్నారు. ఈ ఘటనపై కమిటీని ఏర్పాటుచేసి బాధులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



ఆశ్రమ వసతి గృహంలో మెనూను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి

విద్యార్థినుల ఆహారం పరిశీలన

డుంబ్రిగుడ: మండలంలోని జాముగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్ర రామలక్ష్మి ఆదివారం సందర్శించారు. వంటకాలు మెనూ ప్రకారం ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. పాడైన ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించే వారే కరువయ్యారని విమర్శించారు. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

‘జామిగుడ’ ఘటన బాధాకరం

- విద్యార్థినుల అస్వస్థతపై సమగ్ర విచారణ చేపట్టాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి డిమాండ్



సాక్షి,పాడేరు: డుంబ్రిగుడ మండలం జామిగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా వంద మందికి పైగా గిరిజన విద్యార్థినులు అస్వస్థతకు గురవ్వడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి పర్యటనలో ఉన్న ఆమె ఆదివారం సాక్షితో ఫోన్‌లో మాట్లాడారు. సకాలంలో వైద్యసేవలు అందడంతో విద్యార్థినులు కోలుకున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారంతో పాటు సురక్షిత తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడంతో గిరిజన విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆమె ఆవేదన చెందారు. జామిగుడ ఘటనపై కలెక్టర్, ఇతర అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని గిరిజన విద్యాలయాల్లో నాణ్యమైన మెనూతో పాటు సురక్షిత తాగునీరు అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ సిబ్బందిని కూడా వెంటనే నియమించాలని ఆమె డిమాండ్ చేశారు.

పెరుగుతున్న జోలాపుట్టు, డుడుమ నీటిమట్టాలు





ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన జోలాపుట్టు, డుడుమ జలాశయాల నీటి మట్టాలు మళ్లీ పెరుగుతున్నాయి. డుడుమ జలాశయం నీటి మట్టం 2590 అడుగులు కాగా ఆదివారం నాటికి 2581.40 అడుగులుగా నమోదయింది. దీనికి ఎగువన ఉన్న జోలాపుట్టు జలాశయ నీటి మట్టం సైతం క్రమేపీ పెరుగుతోంది. దీని నీటి సామర్థ్యం 2750 అడుగులు కాగా ఆదివారం నాటికి 2745.60 అడుగులు మేర నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజుకు 2715 అడుగులు నీరు ఉంది. గత ఏడాదితో పోలిస్తే 30 అడుగులమేర నీరు ఎక్కువగా ఉంది. వరద నీరు 600 క్యూసెక్కులు ప్రాజెక్ట్‌లోకి చేరుతోంది. నీటి నిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నందున మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఆరు జనరేటర్లలో నాలుగు పని చేస్తున్నాయి. వీటి ద్వారా 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. 2,5 జనరేటర్లు ఆధునికీకరణలో భాగంగా వినియోగంలో లేవు.

గుర్తుకొస్తున్నాయి..

- ఉమ్మడి విశాఖ జిల్లాపై చెరగని ముద్ర వేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి
- చరిత్ర గతిని మార్చిన మహనీయుడు
- నేడు దివంగత సీఎం వైఎస్సార్ 15వ వర్ధంతి



ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శంకుస్థాపన చేస్తున్న మహానేత డాక్టర్ వైఎస్సార్ (ఫైల్)



ఉమ్మడి జిల్లాలో తొలిదశ ఇందిరమ్మ గృహాలకు శ్రీకారం చుడుతున్న డాక్టర్ వైఎస్సార్ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం/పెందుర్తి: మంచితనానికి మరో పేరు.. మానవత్వానికి ప్రతిరూపం.. చిరునవ్వుకు చిరునామా.. తెలుగోడి పౌరుషానికి ప్రతినిధి.. అచ్చతెలుగు పంచెకట్టుకు వన్నెతెచ్చిన మగధీరుడు..పేదోడి గుండెచప్పుడు ఇలా ఎన్ని చెప్పుకున్నా ఆ మహనీయుడి కోసమే.. వైఎస్సార్.. ఈ మూడక్షరాలు తలంపుకొస్తే ఓ రైతన్నకు కొండంత ధైర్యం వస్తుంది..అక్కచెల్లెమ్మలకు అన్న అండగా ఉన్నాడన్న భరోసా కలుగుతుంది.. విద్యార్థిలోకానికి నేనున్నానంటూ పెద్దాయన వెన్నుతట్టి ప్రోత్సహించిన జ్ఞాపకాలు గుర్తొస్తాయి. వైఎస్ పాలన ముందు.. ఆ తరువాత అన్నట్లు సాగింది ఆ మహనీయుడి పరిపాలన. జిల్లా నలుమూలల ఎక్కడ చూసినా ఆయన అందించిన అభివృద్ధి ఫలాలు కళ్ల ముందే కదలాడతాయి. సోమవారం వైఎస్సార్ 15వ వర్ధంతి. ఈ సందర్భంగా ఆయన చేపట్టిన సంక్షేమ, అభివృద్ధిని ఓసారి గుర్తు చేసుకుందాం.

అభివృద్ధికి బాట : ఉమ్మడి విశాఖ జిల్లాలో 2004–2009 మధ్యలో జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదు. పెండింగ్ ప్రాజెక్ట్‌లకు పునరుజ్జీవం పోయడం, విశాఖ కార్పొరేషన్‌ను గ్రేటర్‌గా మార్చడం, లక్షలాది మంది సొంతింటి కలను సాకారం చేయడం, పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడం, నగరంలో ఉన్న దాదాపు అన్ని పరిశ్రమలకు చేయూతనిచ్చి కార్మికులకు అండగా నిలవడంలో మహానేత తన ముద్ర చూపారు.

స్టీల్‌ప్లాంట్ విస్తరణ వైఎస్ చలవే.. : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేట్ పరమయ్యే స్థితికి చేరుకున్న దశలో వైఎస్సార్ ఆ ప్రక్రియను సమర్థవంతంగా ఆపగలిగారు. పరిశ్రమకు చేయూతనివ్వడంతో పాటు ఆనాడు కేంద్రంతో పోరాటం చేసి ప్లాంట్ విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్ విస్తరణకు పునాదులు వేశారు. అచ్యుతాపురంలో ఇండస్ట్రియల్ కారిడార్, భీమిలిలో ఐటీ కారిడార్, పరవాడ ఫార్మాస్యూటికల్ కారిడార్, దువ్వాడ ఐటీ సెజ్ ఇలా ఎన్నో పరిశ్రమలు వైఎస్సార్ పాలనలో ఉమ్మడి విశాఖ సిగలో ఒదిగాయి.

ఎయిర్‌పోర్టుకు.. : విశాఖ ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ హోదా తీసుకొచ్చిన ఘనత వైఎస్‌దే. రూ.100 కోట్లు కేటాయించి అధునాతన టెర్మినల్ నిర్మాణం జరిపించారు. 1130 పడకలు, 21 సూపర్ స్పెషాలటీ బ్లాకులతో రూ.250 కోట్లతో విమ్స్ ఆస్పత్రికి 2007లో శంకుస్థాపన చేశారు.

ఉచిత విద్యుత్ వెలుగులు : జిల్లా వ్యాప్తంగా 25 వేల వ్యవసాయ సర్వీసులకు ఇప్పటికీ ఉచిత విద్యుత్ అందుతుంది అంటే అది కేవలం వైఎస్సార్ చలవే. రుణమాఫీ ద్వారా రాష్ట్రంలో 17 జిల్లాల పరిధిలో 77.55 లక్షల మంది రైతులకు రూ.1200 కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. మాఫీ వర్తించని జిల్లాలోని 55 వేల మంది రైతులకు రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకం అందించి అండగా నిలిచారు.

- విశాఖ ఏజెన్సీలో కాఫీ ప్లాంటేషన్ ప్రాజెక్టు తీసుకొచ్చింది కూడా వైఎస్ రాజశేఖర్‌రెడ్డే. ఆయన హయాంలో ఈ ప్లాంటేషన్‌కు రూ.144 కోట్లు కేటాయించారు.

అక్కచెల్లెమ్మలకు పావలా వడ్డీ : వైఎస్సార్ అధికారం చేపట్టడానికి ముందు డ్వాక్రా రుణాలకు 14 శాతం వడ్డీ వసూలు చేసేవారు. వారికి అండగా నిలవాలన్న సంకల్పంతో వడ్డీ శాతాన్ని 4 శాతానికి(పావలా) తగ్గించి మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన పాలించిన ఐదేళ్ల కాలంలో సుమారు రూ.1000 కోట్లకు పైగా పావలా వడ్డీ రుణాలను డ్వాక్రా మహిళలు పొందారు.

మూడున్నర లక్షల మందికి గూడు

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,56,115 మందికి సొంత ఇంటి కలను సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌ది. ఐదేళ్ల పాలనలో సాచురేషన్ పద్ధతిలో పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలతో పనిలేకుండా కేవలం అర్హతను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని ప్రజలకు ఇళ్లు కట్టించారు. నగరంలో కూడా పునరావాస, పూర్‌సెటిల్‌మెంట్ కాలనీలను నిర్మించారు. ఇలా నగరంలో దాదాపు లక్ష మందికి సొంత గూడు కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పెందుర్తి మండలం పినగాడిలో వైఎస్సార్ శ్రీకారం చుట్టారు.

వైఎస్ వర్ధంతికి ఏర్పాట్లు

- నేడు భారీగా సేవా కార్యక్రమాలు
- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: ఈనెల 2వ తేదీ సోమవారం దివంగత సీఎం వైఎస్ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాలతోపాటు వాడవాడలా నిర్వహించే ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

నేటి ఐటీడీఏ గ్రీవెన్స్ రద్దు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏలో సోమవారం జరిగే ప్రజా సమస్యల వేదిక (గ్రీవెన్స్)ను వర్షాలు కారణంగా రద్దు చేసినట్లు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. వర్షాల వల్ల సమస్యలు ఉంటే ఉంటే దగ్గరలోని మండల అధికారులకు గాని, ఐటీడీఏ కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియజేయాలని ఆయన సూచించారు.

లంబసింగ్ ఘాట్‌లో బండరాళ్ల తొలగింపు



జేసీబీతో బండరాళ్లు తొలగిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

చింతపల్లి: లంబసింగి ఘాట్ రోడ్డులో శనివారం రాత్రి జారిపడిన బండరాళ్లను ఆదివారం రోడ్లు భవనాల శాఖ అధికారులు తొలగించారు. రోడ్డు మధ్యలో ఉన్నందున రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సమస్యను గుర్తించిన తహసీల్దార్ రామకృష్ణ తొలగింపునకు తక్షణ చర్యలు చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు జేసీబీ సాయంతో ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

- మూడు పతకాలు సాధించిన మధుచందన



చింతూరు: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థిని గుత్తుల మధుచందన బంగారు పతకం, రెండు రజత పతకాలు సాధించింది. గతనెల 30 నుంచి ఆదివారం వరకు అనకాపల్లిలో 11వ రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఆమె ప్లస్ 81 కిలోల కేటగిరీ జూనియర్ విభాగంలో బంగారు పతకం, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో రెండు రజత పతకాలను సాధించింది.

రాలిపోతున్న పసిమొగ్గలు

మరో నవజాత శిశువు మృతి



మృతి చెందిన నవజాత శిశువు



వివరాలు వెల్లడిస్తున్న కుటుంబ సభ్యులు

చింతూరు: నవజాత శిశువుల మరణాలు ఆగడం లేదు. తాజాగా మండలంలోని సరివెల గ్రామానికి చెందిన ఆరు రోజుల నవజాత శిశువు మలద్వారం సమస్య కారణంగా చికిత్స పొందుతూ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సరివెలకు చెందిన కణితి చిలకమ్మకు నెలలు నిండడంతో కాన్పు నిమిత్తం ఆశా వర్కర్ గతనెల 27 ఉదయం చింతూరు ఏరియా ఆస్పత్రిలో చేర్పించింది. అదేరోజు మధ్యాహ్నం ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డకు అస్వస్థతగా ఉండటంతో వైద్యులు పరీక్షించి తమ బిడ్డను 30వ తేదీన చిన్నపిల్లల వార్డు(ఎస్ఎన్‌సీయూ)లో ఉంచి చికిత్స అందించారని చిలకమ్మ భర్త దుర్గారావు, అతని తల్లి లక్ష్మి తెలిపారు. కాగా 31వ తేదీ రాత్రి మీబిడ్డ పరిస్థితి విషమంగా ఉందని భద్రాచలం తీసుకెళ్లాలని అంబులెన్సులో రాత్రి 11.30 గంటల సమయంలో అక్కడి ఏరియా ఆస్పత్రికి పంపినట్లు వారు తెలిపారు. రాత్రి ఒంటిగంటకు అక్కడికి చేరుకున్న అనంతరం తమ బిడ్డను ఐసీయూలో ఉంచి ఉదయం వరకు చికిత్స అందించిన వైద్యులు పరీక్షించి మీ బిడ్డకు కడుపు బాగా ఉబ్బుగా ఉన్నందున వెంటనే వరంగల్ తీసుకెళ్లాలని సూచించారని వారు చెప్పారు.వరద కారణంగా వరంగల్ వెళ్లేందుకు రహదారి లేకపోవడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తీసుకెళ్లేందుకు సిద్ధమై మధ్యాహ్నం బిడ్డను అంబులెన్సులో ఎక్కిస్తుండగా మృతిచెందినట్లు వారు కన్నీటి పర్యంతమయ్యారు. మలద్వారం మూసుకుపోయి ఉన్నందున మలం బయటకు రాక కడుపు ఉబ్బి బిడ్డ మృతిచెందినట్లు అక్కడి వైద్యులు తెలిపినట్లు దుర్గారావు, లక్ష్మి తెలిపారు. బిడ్డకు కామెర్లు, జ్వరంతో పాటు కడుపు ఉబ్బినట్లు ఉండటంతో ఆటో సోనోగ్రఫీ చేయించి తదనంతర చికిత్స అందించేందుకు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు ఎస్ఎన్‌సీయూ ఇన్‌చార్జి డాక్టర్ ఉమర్ తెలిపారు.

గుర్తించడంలో ఆలస్యం జరిగింది

పుట్టిన బిడ్డకు మలద్వారం ఏర్పడక పోవడంతో మలం బయటకు రాక ఇన్‌ఫెక్షన్ కారణంగా పరిస్థితి విషమించి మృతిచెందినట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. ఈ విషయాన్ని ఎస్ఎన్‌సీయూ వైద్యులు ఆలస్యంగా గుర్తించడంతో బిడ్డ పరిస్థితి విషమైందని, ముందుగానే గుర్తించి వుంటే శస్త్రచికిత్స చేసి మలద్వారం ఏర్పరిచే అవకాశముండేదని ఆయన తెలిపారు.

త్వరితగతిన విద్యుత్తు పునరుద్ధరణ పనులు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎప్పటికప్పుడు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని వివరించారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 9 మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. ఈ పనుల్ని యుద్ధప్రాతిపదికన సరిచేసినట్లు తెలిపారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు 2583 ఫిర్యాదులు రాగా వాటిని క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన తెలియజేశామని.. వీటిలో కేవలం ఒక్క రోజులోనే 2175 ఫిర్యాదులను పరిష్కారించగలిగామన్నారు. డైరెక్టర్ ఆపరేషన్స్ విజయలలిత నేతృత్వంలో సీజీఎం ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తిని విజయనగరం సర్కిల్‌కు, జనరల్ మేనేజర్లు జి.ప్రసాద్, ఎల్.దైవప్రసాద్‌లను శ్రీకాకుళం సర్కిల్‌కు నోడల్ ఆఫీసర్లుగా నియమించామని తెలిపారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో 365 మందితో 32 ప్రత్యేక బృందాలుగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో ఇప్పటివరకు గుర్తించిన సమాచారం మేరకు 9 మండలాలకు 9, 60 గ్రామాలకు 60, 3,299 సర్వీసు కనెక్షన్లకు 3,251, 33కెవి ఫీడర్లు 14 కి 14, 11 కేవీ ఫీడర్లు 100కి 100, 11కెవి స్తంభాలు 67కి 58, ఎల్‌టి స్తంభాలు 78కి 70, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 26కి 20, వ్యవసాయ కనెక్షన్లు 56కి 42 సర్వీసులను పునరుద్ధరించినట్లు సీఎండీ వెల్లడించారు. విద్యుత్ అంతరాయం సమాచారం కోసం టోల్ ఫ్రీ నెం. 1912కు, కార్పొరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 9490612633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమండ్రి 7382299960, ఏలూరు 9440902926 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

సీపీఎస్ రద్దుకు వినతి



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎస్ అసోసియేషన్ ప్రతినిధులు

పాడేరు : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును కోరారు. ఆదివారం ఆయనను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో తామంతా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమ తరపున పోరాడాలని కోరారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాసాడ ఈశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ జర్రా కూర్మారావు, సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యార్థినుల అదృశ్యంపై కలకలం

- ఆదివారం కుమ్మరిపుట్టులో ప్రత్యక్షం
- వెతికి పట్టుకున్న కుటుంబ సభ్యులు
- ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు
- విచారణ చేపట్టిన టీడబ్ల్యూ డీడీ

పాడేరు : జి.మాడుగుల మండలం బంధవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు టెన్త్ విద్యార్థినుల అదృశ్యం సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పాఠశాలలో టెన్త్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు గత నెల 27న పాఠశాల నుంచి బయటకు వచ్చేశారు. నాటి నుంచి విద్యార్థినుఉ ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ పిల్లలు పాఠశాలలో లేరని చెప్పి ఊరుకున్నారని, దీంతో తీవ్ర ఆందోళన చెందామని విద్యార్థినుల తల్లిదండ్రులు చెప్పారు. వారి కోసం తీవ్రంగా గాలించామన్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 31న రాత్రి 11 గంటలకు పాడేరు పట్టణం నుంచి ఓ వ్యక్తి ఓ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి తమ కుమార్తె తన వద్ద ఉందని వెంటనే వచ్చి తీసుకు వెళ్లాలని చెప్పాడు. దీంతో ఓ విద్యార్థిని తల్లిదండ్రులు అర్ధరాత్రి ఆటో వేసుకొని పాడేరు వచ్చారు. ఆ సమయంలో ఫోన్ చేసిన వ్యక్తికి తిరిగి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. రాత్రంతా ఆటోతో పాడేరు అంతా వెతికారు. దీంతో కుటుంబ సభ్యులు పాడేరు పోలీసులకు సమాచారం చేరవేశారు. తర్వాత కొంతమంది వ్యక్తుల ద్వారా విద్యార్థినులు పాడేరు పట్టణంలోని కుమ్మరిపుట్టు వద్ద ఓ వ్యక్తి ఇంట్లో ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఇద్దరు విద్యార్థినులను కుటుంబ సభ్యులు తమ వెంట తీసుకొచ్చారు. ఈ విషయంపై విద్యార్థినుల కుటుంబ సభ్యులు ఐటీడీఏ పీవో కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీడబ్ల్యూ డీడీ కొండలరావు విద్యార్థినులు, తల్లిదండ్రులను వెంట పెట్టుకొని బంధవీధి ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సంఘటనలో ప్రమేయం ఉన్న ఓ వ్యక్తిని జి.మాడుగుల పోలీసులకు అప్పగించినట్టు సమాచారం.

పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంపై ధ్వజం

ఈ ఘటనలో జి.మాడుగుల మండలం బంధవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈనెల 27న పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు బయటకు వచ్చిన సంగతి పాఠశాల యాజమన్యానికి స్పష్టంగా తెలుసు. అదే రోజు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి కేవలం సమాచారం మాత్రమే ఇచ్చారని, ఆ తర్వాత పాఠశాల హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్ కనీసం పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోజూ హాజరు సమయంలో కూడా పాఠశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థినుల గురించి పట్టించుకోలేని, ఈ విషయంపై పోలీసులు, సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయకపోవడం దారుణమంటున్నారు. దీంతో పాఠశాల హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్ల తీరుపై కుటుంబ సభ్యులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. విద్యార్థులను తామే వెతికి పట్టుకున్నామని, వారు సురక్షితంగా ఉండడంపై ఊపిరి పీల్చుకున్నామని విద్యార్థినుల తల్లిదండ్రులు చెప్పారు. తమ పిల్లలకు ఏదైనా హాని జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహించేవారని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

కోతకు గురైన మర్రిపుట్టు కాజ్‌వే

- వరద ప్రవాహానికి దెబ్బతిన్న శ్లాబ్
- నిలిచిపోయిన భారీ వాహనాలు, బస్సుల రాకపోకలు
- 125 గ్రామాల ప్రజలకు అవస్థలు
- తక్షణం మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్‌కు వినతి



కోతకు గురైన మర్రిపుట్టు కాజ్‌వే



నిలిచిపోయిన బొంగరం ఆర్టీసీ బస్సు

పెదబయలు: మండల కేంద్రం పెదబయలు నుంచి బొంగరం వెళ్లే మార్గంలో మర్రిపుట్టు వద్ద కాజ్‌వే శ్లాబ్ కొంతభాగం కోతకు గురవడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల వర్షాలకు వరద ప్రవాహ ఉధృతికి బొంగరం వైపు కొంత భాగం దెబ్బతింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అదే ప్రాంతంలో శ్లాబ్ రెండు చోట్ల కూలిపోయింది. దీంతో కాజ్‌వే పైనుంచి కేవలం బైక్‌లు వెళ్లేందుకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో అటువైపు ఉన్న ఆటోలు, బస్సులు, జీపులు జి.మాడుగుల మీదుగా పాడేరు వెళ్తున్నాయి. ఆదివారం ఉదయం పాడేరు నుంచి పెదబయలు మీదుగా బొంగరం వెళ్లిన ఆర్టీసీ బస్సు కూడా అదే మార్గంలో పాడేరు చేరుకుంది. మధ్యాహ్నం పాడేరు నుంచి బొంగరం వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు గోమంగి వరకు మాత్రమే వెళ్లింది. ఈ మార్గంలో పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల మండలాలకు చెందిన గుల్లేలు, కుంతుర్ల, లింగేటి, బొంగరం, గిన్నెలకోట, ఇంజరి పరిధిలో సుమారు 125 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పుడు కాజ్‌వే దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లే అవకాశం ఉంది. దీంతో వారంతా ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వరదలకు దెబ్బతిన్న వెంటనే అధికారులు మరమ్మతులు చేపట్టి ఉంటే శ్లాబ్ దెబ్బతినేది కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు మండలాల గ్రామాలను కలిపే రింగ్ రోడ్డు కావడంతో అధికారులు తక్షణం స్పందించి మరమ్మతులు చేపట్టేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నిండుకుండలా జలాశయాలు

- డొంకరాయికి వరద తాకిడి
- రెండు గేట్లు ఎత్తివేత
- 4400 క్యూసెక్కులు దిగువకు విడుదల

మోతుగూడెం: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో సీలేరులోని గుంటవాడ, డొంకరాయి జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి.డొంకరాయి రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా, ప్రస్తుతం 1035 అడుగులకు చేరుకుంది. దీంతో రెండు గేట్లను ఆదివారం అధికారులు ఎత్తివేసి రెండు అడుగుల మేర 4400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.అలాగే గుంటవాడ జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 1336 అడుగులు. ప్రస్తుతం 1335 అడుగుల మేర నీరు చేరింది.ఇలావుండగా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మూడు యూనిట్లు, డొంకరాయిలో ఒకటి, మోతుగూడెంలో 3 యూనిట్ల ద్వారా ప్రతిరోజు ఆరువేల మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని మోతుగూడెం డీఈఈ బాలకృష్ణ తెలిపారు.

ప్రమాదస్థాయికి నీటిమట్టాలు



భూపతిపాలెం ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న నీరు



సూరంపాలెం ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న నీరు

భూపతిపాలెం ప్రాజెక్టు:	
ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం (ఎఫ్ఆర్ఎల్)	: 204మీటర్లు
ప్రస్తుత నీటిమట్టం	: 203.60 మీటర్లు
నీటి నిల్వ	: 0.645 టీఎంసీలు
ముసురుమిల్లి ప్రాజెక్టు:	
ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం	: 123 మీటర్లు
ప్రస్తుత నీటి మట్టం	: 115.3మీటర్లు
నీటి నిల్వ సామర్థ్యం	: 1.6 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	: 0.56టీఎంసీలు
సూరంపాలెం ప్రాజెక్టు:	
ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం	: 105 మీటర్లు
ప్రస్తుత నీటి మట్టం	: 104.6మీటర్లు

రంపచోడవరం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీలోని ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. ప్రమాదకర స్థాయిలో నీటి నిల్వలు చేరుకోవడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. భూపతిపాలెం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెట్టారు. సూరంపాలెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి 900 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెట్టారు.

గర్భిణులకు గడిచిన గండం

- ఏజెన్సీలో తాడు సాయంతో కాలువలు దాటించిన బంధువులు
- కలెక్టర్ ఆదేశాలతో రంపచోడవరం, యు.చీడిపాలెం ఆస్పత్రులకు తరలింపు



చంద్రమ్మను కాలువ దాటిస్తున్న బంధువులు



పూర్ణిమను తాడు సాయంతో కాలువ దాటించిన బంధువులు

కొయ్యూరు: భారీ వర్షాలకు ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో గర్భిణులు ఇబ్బంది పడకుండా కలెక్టర్ దినేష్‌కుమార్ ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ నెల్లో, వచ్చే నెల్లో ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించాల్సిందిగా స్థానిక వైద్య సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ఇద్దరు గర్భిణులను కాలువలు దాటించి, ఆస్పత్రుల్లో చేర్చేందుకు బంధువులు చాలా అవస్థలు పడాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే... యు.చీడిపాలెం పంచాయతీ మర్రిపాకలకు చెందిన గర్భిణి చంద్రమ్మకు మరో 15 రోజుల్లో కాన్పు అవుతుందని డేట్ ఇచ్చారు. దీంతో ఆమెను నీలవరం, గంగవరం మీదుగా పలకజీడి తీసుకువచ్చారు. ఆ ఊళ్లను ఆనుకుని ఉన్న కాలువలు దాటించేందుకు బంధువులు చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. తాడు సాయంతో ఆమెను కాలువ దాటించి పలకజీడికి తెచ్చారు. అక్కడి నుంచి రహదారి సౌకర్యం ఉండడంతో అంబులెన్స్‌లో వై.రామవరం తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఆస్పత్రిలో చేర్చారు. అదే పంచాయతీకి చెందిన వంతల పూర్ణిమ కూడా గర్భిణీయే. అక్టోబర్లో ప్రసవ తేదీ. ఆమెనూ ముందుగానే ఆస్పత్రికి తరలించేందుకు ఆదివారం బంధువులు నీలవరం, యర్రవరం మీదుగా పలకజీడి తీసుకువచ్చారు. తాడు సాయంతో కాలువ దాటించి, యు.చీడిపాలెం ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగానే ఉన్నారు. అయితే వర్షాలు కావడంతో కాలువలు దాటించడం కష్టంగా మారిందని బంధువులు తెలిపారు.

సీఐలకు బదిలీ

వీఆర్‌లో ఉన్న 8 మందికి పోస్టింగ్

సాక్షి, అనకాపల్లి: విశాఖ రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేయడంతో పాటు వీఆర్‌లో ఉన్న ఎనిమిది మందికి పోస్టింగ్ ఇచ్చారు. ఇద్దరిని వీఆర్‌కు పంపారు. ఈమేరకు ఆదివారం డీఐజీ గోపీనాథ్ జట్టి ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో పీసీఆర్ సీఐగా పనిచేస్తున్న నమ్మి గణేష్‌ను అచ్యుతాపురానికి, పరవాడ సీఐ బాల సూర్యారావును ఎస్పీకార్యాలయం స్పెషల్ బ్రాంచ్‌కు, నక్కపల్లి సీఐ జి.అప్పన్నను పాయకరావుపేటకు, కె.కోటపాడు సీఐ బి.చిన్నస్వామి నాయుడును శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్‌కు, అల్లూరి జిల్లా పాడేరు సీఐ డి.నవీన్‌కుమార్‌ను అదే జిల్లాలో సీసీఎస్ సీఐగా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న సీఐ రేవతమ్మకు నర్సీపట్నం రూరల్ సీఐగా ,పైడపునాయుడుకు కె.కోటపాడు సర్కిల్ సీఐగా, ఎం.వినోద్ బాబుకు సోషల్‌మీడియా సైబర్ సెల్ సీఐగా, డి.. దీనబంధుకు అల్లూరి జిల్లా పాడేరు సీఐగా, ఆర్.మల్లికార్జునరావుకు పరవాడ సీఐగా, బెండి వెంకట్రావ్‌కు విజయనగరం టాస్క్‌ఫోర్స్ సీఐగా, జి.అశోక్ కుమార్‌కు అనకాపల్లి రూరల్ సీఐగా, వి. చక్రధరరావుకు విజయనగరం డీసీఆర్‌బీ సీఐగా పోస్టింగ్ కల్పించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సీఐగా పనిచేస్తున్న బుచ్చిరాజును, అల్లూరి జిల్లాలో సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న వెలగాడ శంకర నారాయణను వీఆర్‌కు బదిలీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా



సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు,ఈగల బెడద లేకుండా చూసుకోవాలన్నారు.ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన సకాలంలో వైద్యసేవలు పొందాలన్నారు. జ్వరపీడితులు రక్తపరీక్షలు జరుపుకోవాలన్నారు. జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



చింతూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

ఏరియా ఆసుపత్రి పీవో ఆకస్మిక తనిఖీ

చింతూరు: ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదివారం రాత్రి స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించిన ఆయన రోగులతో మాట్లాడి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల కోసం ఆహారం వండుతున్న వంటశాలలను పరిశీలించారు. శాశ్వత వంటశాల కోసం ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ఆవుల వెంకట రామారావు (ఫైల్)

కూనవరం : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పల్లూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మర్రిగూడెం గ్రామానికి చెందిన ఆవుల వెంకట రామారావు (28), పల్లూరు గ్రామంలోని ఓ ఇంట్లో వైరింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతనిని కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతునికి భార్య, చిన్న పాప ఉన్నట్టు చెప్పారు.